సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 14 । మార్చి । 2024




**సోమశిలలో 13.18 టీఎంసీలు**
సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 13.18 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 2600 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.




**బంగారం ధరలు**
24 క్యారెట్లు (10 గ్రాములు) రూ.67,430
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) రూ.6,056
మూడు శాతం జీఎస్టీతో రూ.6,238
నవర (8 గ్రాములు) రూ.49,904

**వాతావరణం**
గరిష్ఠం/కనిష్ఠం 36.3 /25.0
బుధవారం గాలిలో తేమ 69 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గురువారం స్వల్ప మార్పులు ఉండవచ్చని వాతావరణశాఖ తెలిపింది.




## గవర్నర్‌కు ఆత్మీయ స్వాగతం



హెలిప్యాడ్ వద్ద గవర్నర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆనం అరుణమ్మ, హరినారాయణన్



పోలీస్ సిబ్బంది నుంచి గౌరవవందనాన్ని స్వీకరిస్తున్న గవర్నర్

**నెల్లూరు(దర్గామిట్ట) / నెల్లూరు(క్రైమ్):** ప్రధానమంత్రి సూరజ్ జాతీయ పోర్టల్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు గానూ నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం విచ్చేశారు. ఈ సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లోని హెలిప్యాడ్ వద్ద ఆయనకు వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, కలెక్టర్ హరినారాయణన్ పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఓ హోటల్లో బసచేసి అక్కడి నుండి నేరుగా కళాక్షేత్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. లబ్ధిదారులకు కిట్లు, హెల్త్‌కార్డులను అందజేశారు. సాయంత్రం 5.30కు నెల్లూరు నుంచి పయనమయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ విజయకృష్ణన్, ఆర్డీఓ మలోల, ఎస్సీ కార్పొరేషన్ డీడీ రమేష్, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**భారీ భద్రత ఏర్పాట్లు**
ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. గవర్నర్ పర్యటించే ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. డాగ్, బాంబ్‌స్క్వాడ్లు విస్తృత తనిఖీలు చేపట్టాయి.

### న్యూస్‌రీల్

## నామినేషన్ల వరకు ఓటు నమోదు

- కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

**నెల్లూరు(దర్గామిట్ట):** నామినేషన్ల ప్రక్రియ చివరి రోజు వరకు ఓటు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్ల తొలగింపులు, చేర్పుల కోసం జనవరి 22 నాటికి 79,690 దరఖాస్తులు రాగా, వీటిలో 68,291 మేర అంగీకరించామని చెప్పారు. 10,958 అర్జీలు తిరస్కరణకు గురికాగా, మిగిలిన 441 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిని వెంటనే పరిశీలించేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. జిల్లాలో ఓటర్ల జాబితా ప్రచురణపై వచ్చిన ప్రతికూల వార్తలపై చర్యలు చేపట్టామన్నారు. ఇన్‌చార్జి డీఆర్వో బాపిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున నారాయణ, టీడీపీ నుంచి రసూల్, హరికృష్ణ, సురేంద్రబాబు, బీజేపీ నుంచి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అత్యాధునికంగా క్రికెట్ మైదానం



మాట్లాడుతున్న గోపీనాథ్‌రెడ్డి

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** గొలగమూడి ప్రాంతంలో 23 ఎకరాల విస్తీర్ణంలో ఏసీఏ క్రికెట్ మైదానాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దుతున్నామని, మరో ఆర్నెల్లలో క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఏసీ స్టేడియంలోని క్రికెట్ నెట్స్, బుజబుజనెల్లూరులోని సీఐఏ మైదానాన్ని బుధవారం పరిశీలించారు. కొండాయపాళెంలో యునైటెడ్ క్రికెట్ క్లబ్ నెట్స్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని చెప్పారు. కావలి, నెల్లూరు, తిరుపతి జిల్లాలోని వెంకటగిరిలో గల సబ్ సెంటర్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. జిల్లాకు చెందిన అశ్విన్ హెబ్బార్, రేవంత్‌రెడ్డి తమ ప్రతిభతో జిల్లా కీర్తిని ఇనుమడింపజేస్తున్నారని కొనియాడారు. క్రీడాకారులను మరింత ప్రోత్సహించేందుకు ఏపీఎల్ పేరుతో పోటీలను నిర్వహిస్తున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా తొలిసారిగా మహిళలకు పోటీలను త్వరలో నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. అనంతరం యువ క్రీడాకారులకు పలు అంశాలపై దిశానిర్దేశనం చేశారు. ఎన్డీసీఏ అడ్వైజర్, మాజీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఏసీఏ జూనియర్స్ సెలక్షన్ కమిటీ సభ్యులు మలిరెడ్డి కోటారెడ్డి, ఎన్డీసీఏ కోశాధికారి అబూబకర్, సీనియర్ క్రీడాకారులు భానుప్రకాష్‌రెడ్డి, శ్రీనివాసులు, కోచ్‌లు జూలకర్, రాజశేఖర్, మాధురి, ప్రభాకర్, మేనేజర్ నవాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు పెద్దపీట



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

- రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి
- మహిళా దీవెనలో పాల్గొనడం సంతోషకరం
- అన్ని నియోజకవర్గాల అభివృద్ధికి కృషి

**నెల్లూరు సిటీ:** రాష్ట్రంలో మహిళా సాధికారత, సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమాలు, అమలు చేసిన పథకాలను దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వాలూ చేపట్టలేదని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 27వ డివిజన్లో బుధవారం నిర్వహించిన మహిళా దీవెన కార్యక్రమానికి ఎంపీలు విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడారు. డీబీటీ ద్వారా 126 సార్లు బటన్ నొక్కి లబ్ధిదారులకు రూ.2.6 లక్షల కోట్ల ప్రయోజనాన్ని సీఎం చేకూర్చారని కొనియాడారు. తన సొంత జిల్లాలో మహిళా దీవెన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. ప్రతి పథకం ద్వారా లబ్ధిని అందిస్తూ.. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం, స్వావలంబనను తమ ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, చేయూత తదితర పథకాల ద్వారా మహిళల బ్యాంక్ ఖాతాల్లో నగదును జమచేసిన అంశాన్ని ప్రస్తావించారు. మహిళలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ 50 శాతం నామినేటెడ్ పదవులను కల్పించిన ఘనత సీఎంకే దక్కుతుందని చెప్పారు. సున్నా వడ్డీ రుణాలు వారి ఆర్థిక ఎదుగుదలకు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. 2029లో జరగనున్న సాధారణ ఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో ప్రతి ముగ్గురిలో ఒక మహిళ ప్రాతినిధ్యం వహించనుందని చెప్పారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లుకు మద్దతునిచ్చి మహిళా సాధికారతకు నిర్వచనం పలికిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. పార్లమెంట్‌లో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేసిందని గుర్తుచేశారు.

**భారీ మెజార్టీతో గెలిపించండి**
నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా తనకు.. రూరల్ నియోజకవర్గ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. ఇంత పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరై తమకు దీవెనలు అందించిన వారికి కృతజ్ఞతలను తెలియజేశారు. ప్రతి పథకం ద్వారా లబ్ధిని నేరుగా మహిళల ఖాతాల్లో జమచేసి.. మహిళా పక్షపాతిగా ప్రశంసలు అందుకుంటున్న సీఎంకు రానున్న ఎన్నికల్లోనూ అండగా ఉండాలని కోరారు. ఎన్నికల సమయంలో అబద్ధాలు చెప్తూ ప్రజల వద్దకు మోసగాళ్లు వస్తున్నారని, ఇలాంటి వారిని నమ్మొద్దని కోరారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మేయర్ స్రవంతి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏటా జాబ్‌మేళాలు



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, చిత్రంలో బీద మస్తాన్‌రావు, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి

**కావలి:** నెల్లూరు పార్లమెంట్ పరిధిలో జాబ్ మేళాలను ఏటా నిర్వహిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి హామీ ఇచ్చారు. కావలి సమీపంలోని ఆరెస్సార్.. పీబీఆర్ విట్స్ ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థులతో బుధవారం నిర్వహించిన ముఖాముఖీ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. పార్టీ తరఫున తిరుపతి, విశాఖపట్నం, కడప, గుంటూరులో జాబ్ మేళాలను గతంలో నిర్వహించామని, దీని ద్వారా వేల సంఖ్యలో యువత ఉద్యోగాలు సాధించారని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా, వసతి దీవెన పథకాల రూపంలో విద్యార్థులకు ప్రభుత్వం సహకరిస్తోందని చెప్పారు. ఉద్యోగమే కాకుండా వ్యాపార, రాజకీయ, అనేక రంగాల్లోనూ ఉన్నతంగా ఎదగొచ్చని తెలిపారు.

**కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలి**
దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవడం ద్వారా ఎంచుకున్న రంగంలో మరింతగా రాణించొచ్చని పేర్కొన్నారు. విద్యార్థులతో ముఖాముఖీ తనకెంతో ఆనందాన్నిస్తోందని చెప్పారు. తాను అకౌంటింగ్ చదివానన్నారు. ఉన్నత చదువులకు విదేశాలకెళ్లే వారు అక్కడ కొంతకాలం ఉద్యోగం చేసి తిరిగి స్వదేశానికి వచ్చి అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఇంజినీరింగ్ చదివే విద్యార్థుల సంఖ్య కొన్నేళ్లుగా పెరుగుతోందని, తాను చదువుకునే రోజుల్లో ఎక్కువ మంది కామర్స్, సైన్స్ కోర్సులను అభ్యసించేవారని చెప్పారు. ఇంజినీరింగ్ విద్యకు అంతగా అవకాశాలు ఉండేవి కావన్నారు. యూపీఎస్సీకి ఎంపికవుతున్న వారిలో ఎక్కువ మంది ఇంజినీరింగ్ విద్యార్థులేనని తెలిపారు.

**రాజకీయాల వైపు విద్యార్థులు రావాలి**
ప్రస్తుత రోజుల్లో చాలా మంది విద్యార్థులు రాజకీయాలవైపు ఆసక్తి చూపడం లేదని.. రాజకీయాలు మంచివి కావనే భావనను తమ మది నుంచి తొలగించాలని కోరారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## గుమ్మళ్లదిబ్బలో కేంద్ర బృందం పర్యటన



**కోవూరు:** మండలంలోని గుమ్మళ్లదిబ్బలో ఢిల్లీకి చెందిన పశుసంవర్ధక శాఖ జాయింట్ కమిషనర్ డాక్టర్ విజయ్‌కుమార్, భోపాల్‌కు చెందిన సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ మనోజ్‌కుమార్ బుధవారం పర్యటించారు. గ్రామంలో బర్డ్ ఫ్లూ ఇటీవల ప్రబలిన నేపథ్యంలో వెంకటేశ్వర్లు ఇంటిని సందర్శించి కోళ్లను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు.. ఎప్పుడు వైరస్ సోకింది.. ప్రయోగశాలలకు ఎప్పుడు తీసుకెళ్లారనే అంశమై ఆరాతీశారు. ఎన్ని కోళ్లు మృతి చెందాయి.. ఎన్నింటిని పశుసంవర్ధక శాఖ అధికారులు ఖననం చేశారనే అంశమై వివరాలను సేకరించారు. పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగమణి, అసిస్టెంట్ డైరెక్టర్ చైతన్య, డాక్టర్ అరుణ, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి, పశు వైద్యులు షబానా, ప్రీతి, వెటర్నరీ అసిస్టెంట్ సజ్జద్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో జిల్లా నేతలకు చోటు



నిర్మల

**నెల్లూరు(దర్గామిట్ట):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగ కమిటీలో జిల్లాకు చెందిన పార్టీ నేత మల్లి నిర్మలకు చోటు కల్పించారు. మహిళా విభాగ అధికార ప్రతినిధిగా ఆమెను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది.

- రాష్ట్ర రైతు విభాగంలో సెక్రటరీగా జిల్లాకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డిని నియమించారు.

# కొవ్వొత్తులతో ప్రదర్శన



నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేటలో..



వింజమూరులో..

**వింజమూరు(ఉదయగిరి):** సోషల్ మీడియాలో టీడీపీ, జనసేన గ్యాంగ్ వేధింపులను తాళలేక తెనాలికి చెందిన పేదింటి మహిళ గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనను నిరసిస్తూ వింజమూరులో కొవ్వొత్తులతో ప్రదర్శనను బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. జగనన్న ప్రభుత్వం ద్వారా తనకు జరిగిన మేలును గీతాంజలి చెప్పడాన్ని సహించలేని టీడీపీ, జనసేన మూకలు ఆమెను మానసికంగా హింసించి ఆత్మహత్యకు ప్రేరేపించారని ఆరోపించారు. సదరు మహిళ కుటుంబానికి న్యాయం జరిగేలా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని కాంక్షిస్తూ స్టోన్‌హౌస్‌పేటలో కొవ్వొత్తులతో ర్యాలీని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్పొరేటర్లు మద్దినేని మస్తానమ్మ, కిన్నెర ప్రేమ్‌కుమార్, ఓబిలి రవిచంద్ర, నీలి రాఘవరావు, నేతలు పెళ్లూరు శ్రీనివాసులు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

**నెల్లూరు(మినీబైపాస్):** బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను జిల్లాలో త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నామని సంస్థ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పుగొంది బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సేవలకు సంబంధించిన పరికరాలు నెల్లూరు చేరుకున్నాయని చెప్పారు. 2జీ, 3జీ సిమ్‌లు ఉన్న వినియోగదారులు సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్ లేదా రిటైలర్‌ను సంప్రదించి 4జీ సిమ్‌లను ఉచితంగా పొందవచ్చని పేర్కొన్నారు.

## వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారితో ఆదాల ప్రభాకర్‌రెడ్డి

**నెల్లూరు సిటీ:** రూరల్‌లోని 30వ డివిజన్‌కు చెందిన దాదాపు 300 మంది టీడీపీ శ్రేణులు ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో బుధవారం చేరారు. మినీబైపాస్ రోడ్డులోని ఎంపీ నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పిండి సురేష్ నేతృత్వంలో ఆ ప్రాంతానికి చెందిన నల్లగట్ల ప్రభావతి, వారి మిత్ర బృందం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన అనంతరం ఎంపీ మాట్లాడారు. పార్టీలో చేరిన వారికి ఎలాంటి కష్టమొచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కో ఆప్షన్ సభ్యురాలు మొబీనా, మాజీ కార్పొరేటర్ వేల్పుల రజని, చింతల జ్యోతి, మైపాడు అల్లాబక్షు, మద్దాలి శ్రీధర్, బెల్లంకొండ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

- రూరల్‌కు చెందిన క్రిస్టియన్ నేతలు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు. జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిచయ కార్యక్రమంలో నన్నం సుకుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు 'నాడు – నేడు' వరం




మాట్లాడుతున్న నాగార్జునయాదవ్

**నెల్లూరు(అర్బన్):** ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు – నేడు పథకం పేద విద్యార్థులకు ఒక వరమని రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక వసతుల సదుపాయాల కల్పన సంస్థ చైర్మన్ యనమల నాగార్జునయాదవ్ పేర్కొన్నారు. నాడు – నేడు ద్వారా పాఠశాలల్లో జరిగిన మార్పులను పరిశీలించేందుకు గానూ తమ బృందంతో కలిసి జిల్లాలో బుధవారం ఆయన పర్యటించారు. కందుకూరులోని బాలికోన్నత, ముసునూరులోని జెడ్పీ, నార్త్ రాజుపాళెంలోని ఉన్నత, నగరంలోని కేఎన్నార్ పాఠశాలలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నాడు – నేడు ద్వారా రూ.431 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారని చెప్పారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో మంచి విద్యను అందించేందుకు రూ.17 వేల కోట్లకుపైగా వెచ్చించి దేశానికే ఆదర్శంగా సీఎం నిలిచారని కొనియాడారు. పేద విద్యార్థులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని కాంక్షించారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ శ్యామ్‌సన్, ఏఈ నజీరుద్దీన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# కిడ్నీలు కాపాడుకుందాం

కిడ్నీలు (మూత్రపిండాలు) బాగోలేకపోతే రక్తాన్ని వడపోయడం కష్టం. శరీరమంతా వ్యాధులమయంగా మారిపోతుంది. అందుకే వాటిని జాగ్రత్తగా చూసుకోవాలి. మనం తీసుకునే ఆహారం, అలవాట్లు వాటిని ప్రభావితం చేస్తాయి. జీవన విధానం మారిపోవడంతో రోజురోజుకు కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరిగిపోతున్నారు. సరైన అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యం కారణంగా మృత్యువాత పడుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. గురువారం వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా కథనం.

- జిల్లాలో సుమారు 60 వేలమంది రోగులు
- చిన్నపిల్లలు సైతం బాధితులే..
- పెద్దాస్పత్రిలోనే నెలకు 1,200 మందికి చికిత్స
- నేడు వరల్డ్ కిడ్నీ డే



నెల్లూరు(అర్బన్): కోవిడ్ తర్వాత కిడ్నీ వ్యాధిగ్రస్తులు వేగంగా పెరుగుతున్నట్లు వైద్యులు అంచనా వేస్తున్నారు. మన జిల్లాలో చిన్నబిడ్డల నుంచి వృద్ధుల వరకు సుమారు 60 వేల మంది బాధితులున్నట్లు చెబుతున్నారు. వీరిలో అనేకమంది తరచూ డయాలసిస్ చేయించుకుంటూ బతుకు బండి లాగిస్తున్నారు. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కిడ్నీ ఫౌండేషన్ ప్రపంచ ఆరోగ్య సంస్థ సహకారంతో మార్చి రెండో గురువారం కిడ్నీ డేగా జరుపుకోవాలని చెప్పింది. ప్రతి ఒక్కరికీ మూత్రపిండాల ఆరోగ్యం అనే నినాదాన్ని ఈ సంవత్సరం థీమ్‌గా డబ్ల్యూహెచ్‌ఓ ప్రకటించింది. కిడ్నీలు త్వరగా జబ్బున పడటానికి ప్రధాన కారణం అధిక రక్తపోటు (బీపీ), అదుపులో ఉండని డయాబెటిస్ (షుగర్). జిల్లాలో ఉండే కిడ్నీ వ్యాధిగ్రస్తులను పరిశీలిస్తే 40 శాతం మధుమేహంతో బాధపడే వారే. అలాగే మరో 30 శాతం అధిక బీపీ ఉన్న వారే. మరో కారణం ఊబకాయం.

**ఇక్కడిలా..**

నెల్లూరులోని సర్వజన ఆస్పత్రిలో (పెద్దాస్పత్రిలో) నెలకు 1,200 మంది రోగులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద డయాలసిస్ చేస్తున్నారంటే పరిస్థితి తీవ్రత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క సీహెచ్‌సీల పరిధిలోనే ఈ సంవత్సరం 302 కొత్త కిడ్నీ కేసులు నమోదయ్యాయి. ఇక పీహెచ్‌సీలు, ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్‌ను పరిగణలోకి తీసుకుంటే రోగుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

### జీవన విధానం మార్చుకోవాలి



కిడ్నీ ఆరోగ్యంగా పనిచేసేందుకు ప్రజలు తమ జీవన విధానం మార్చుకోవాలి. జంక్ ఫుడ్ మానేయాలి. మంచినీరు ఎక్కువగా తాగాలి. పండ్లు, తాజా కూరగాయలు వినియోగించాలి. కోవిడ్ తర్వాత కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య కూడా పెరిగింది. ప్రజలు అవగాహన పెంచుకోవాలి. ధూమపానం అలవాటు ఉన్న వారు మానేయాలి. కాళ్ల గిరకల ప్రాంతంలో వాపు ఉన్నా.. మూత్రం సరిగా రాకపోయినా డాక్టర్‌ను సంప్రదించాలి. సకాలంలో వైద్యం చేయించుకుంటే డయాలసిస్ వరకు వెళ్లాల్సిన పనిలేదు.
– డాక్టర్ మస్తాన్‌వలీ, నెఫ్రాలజిస్ట్, కిమ్స్

### 250 మందికి పైగా..

జిల్లాలో ఇప్పటి వరకు ఉన్న సమాచారం మేరకు 250 మందికి పైగా తమ కిడ్నీలు మార్పించుకున్నారు. మరికొంతమందికి ఒక కిడ్నీ తీసేయగా రెండో దానితోనే జీవనం కొనసాగిస్తున్నారు. ఇటీవల బుజబుజనెల్లూరు, కలువాయి మండలం తదితర ప్రాంతాల్లోని వ్యక్తులకు ఆపరేషన్ చేసి జబ్బుకు గురైన ఒక కిడ్నీ తీసివేశారు. అపోలో ఆస్పత్రిలో 76 మందికి, నారాయణ ఆస్పత్రిలో 122 మందికి, కిమ్స్‌లో 34 మందికి, మెడికవర్‌లో 27 మందికి కిడ్నీ మార్పిడి జరిగినట్లు లెక్కలున్నాయి.

# క్రీడాకారుల సంక్షేమానికి సీఎం ప్రాధాన్యం

- రూ.200 కోట్లతో మొగళ్లపాళెం స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం
- వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ సమన్వయకర్త విజయసాయిరెడ్డి




క్రీడాకారులతో విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఖలీల్ అహ్మద్ తదితరులు

నెల్లూరు(బృందావనం): 'రాష్ట్రంలో క్రీడా రంగ ప్రగతికి, క్రీడాకారుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇచ్చారు. ఇందులో భాగంగా ఇటీవల భారీ స్థాయిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు' అని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త విజయసాయిరెడ్డి అన్నారు. వివిధ క్రికెట్ క్లబ్‌ల్లో ఆడి ప్రతిభ చూపిన 35 మంది క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులోని పురమందిరంలో బుధవారం వారికి క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విజయసాయిరెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు క్రికెట్ సంపన్న కుటుంబాలకే పరిమితమైందన్నారు. నేడు సామాన్యుడు సైతం ఆడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రతి క్రీడాకారుడికి ప్రభుత్వం అండగా ఉందన్నారు.

**రోహిత్ శర్మను స్ఫూర్తిగా తీసుకోవాలి**

భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ తెలుగు మూలాలున్న వ్యక్తి అని విజయసాయిరెడ్డి చెప్పారు. యువ క్రీడాకారులు ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో రాణించడం ద్వారా జీవితంలో ఉన్నతంగా ఎదగడమే కాకుండా సేవా దృక్పథంలో భాగంగా రాజకీయాల్లో సైతం అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. క్రికెట్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించిన కొందరు పార్లమెంట్, రాజ్యసభలో అడుగుపెట్టారని గుర్తుచేశారు. తాను వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్రా ఇన్‌చార్జిగా వ్యవహరించిన సమయంలో ప్రగతి భారత్ ఫౌండేషన్ పేరుతో ప్రతి ఏడాది క్రికెట్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో 800 టీమ్‌లు పాల్గొనేవని వెల్లడించారు. అదే రీతిలో నెల్లూరు పార్లమెంట్ పరిధిలో రానున్న ఏడాదిలో పోటీలను నిర్వహిస్తానన్నారు. రూరల్ నియోజకవర్గంలోని మొగళ్లపాళెంలో 150 ఎకరాల విస్తీర్ణంలో శాప్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.200 కోట్లతో నిర్మిస్తామన్నారు. అండర్–19 క్రికెట్ జట్టుకు ఎంపికైన నెల్లూరు క్రీడాకారుడు రేవంత్‌రెడ్డిని విజయసాయిరెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకరరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, సిటీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గోపీనాథ్‌రెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, క్రికెట్ అసోసియేషన్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

**పొదలకూరు నిమ్మధరలు (కిలో)**



పెద్దవి : రూ.85
సన్నవి : రూ.75
పండ్లు : రూ.30

## కోవూరులో అభివృద్ధి పనులకు రూ.2 కోట్లు

- మంజూరు చేసిన విజయసాయిరెడ్డి

కోవూరు: నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త వేణుంబాక విజయసాయిరెడ్డి ఇప్పటి వరకు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విజయసాయిరెడ్డిని అడిగిన వెంటనే నిధులు మంజూరు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి భవిష్యత్‌లోనూ ఆయన సహాయ సహకారాలు ఉంటాయన్నారు.

## యువకుడి ఆత్మహత్య



విజయన్ మృతదేహం

ముత్తుకూరు: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ముత్తుకూరులో జరిగింది. ఎస్సై శ్రీనివాసరెడ్డి బుధవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. తమిళనాడు తిరువళ్లూరుకు చెందిన ఆర్ముగం విజయన్ (27) కృష్ణపట్నం పోర్టులో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ముత్తుకూరులోని ఓ హోటల్ గదిలో ఉంటున్నాడు. మంగళవారం డ్యూటీకి వెళ్లాల్సిన అతను ఎంతకూ బయటికి రాలేదు. దీనితో సహచరులు గది తలుపులు పగులగొట్టి చూడగా ఉరేసుకుని ఉన్నాడు. మరో నెలలో విజయన్‌కు వివాహం జరగాల్సి ఉంది. పెళ్లి ఇష్టం లేకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. బుధవారం మృతదేహానికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 118
లేయర్ (లైవ్) : 73
బ్రాయిలర్ చికెన్ : 210
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 236
లేయర్ చికెన్ : 125

# చంద్రబాబూ.. నాటి హామీలు ఏమయ్యాయి?

- ప్రశ్నించిన రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- చేనేత మగ్గాలు అందజేత



చేనేత కార్మికుడికి గుర్తింపు కార్డు అందజేస్తున్న మంత్రి కాకాణి

మనుబోలు: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేకే టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు పెట్టుకున్నాయి. 2014లో కూడా కూటమిగా వచ్చారు. అప్పుడు అధికారంలోకి వచ్చినా ప్రజలకు ఏమీ చేయలేదు. నాడు ఇచ్చిన హామీలు ఏమయ్యాయో చంద్రబాబు నాయుడు ప్రజలకు చెప్పాలి' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మడమనూరు గ్రామంలో బుధవారం చేనేతలకు మగ్గాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేతన్న నేస్తం కింద మనుబోలు మండలంలో ఇప్పటికే రూ.కోటి అందజేసినట్లు తెలిపారు. వెంకటాచలం క్లస్టర్ పరిధిలో మొత్తం 192 మగ్గాలను పంపిణీ చేశామన్నారు. గ్రామంలోనే రూ.1.95 కోట్లతో సీసీ రోడ్లు, రూ.1.08 కోట్లతో సైడ్ డ్రెయిన్లు, రూ.1.40 కోట్లతో జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ తాగునీటి కుళాయిల పనులు చేపట్టినట్లు తెలిపారు.

**ప్రజలు ఆలోచించాలి**

ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక వైపు, అబద్ధపు హామీలతో మోసగించిన చంద్రబాబు మరో వైపు ఎన్నికల క్షేత్రంలో ఉన్నారని, ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కాకాణి కోరారు. ఆర్బీకేల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుడు వరప్రసాద్, ఎంపీపీ వజ్రమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, డైరెక్టర్ బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నాయకులు కొండూరు రామచంద్రారెడ్డి, షేక్ రఫీ, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, గుండాల ఆదినారాయణ, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, గుంజి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐదువేల మందికి ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



చిన్న తరహా పరిశ్రమ స్థాపనకు మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: నారంపేట ఇండస్ట్రియల్ పార్కు (ఎంఎస్‌ఎంఈ)లో పరిశ్రమలు ఏర్పాటు చేయించి కనీసం ఐదువేల మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. పరిశ్రమలు స్థాపించేందుకు ఉత్సాహంగా ఉన్న వారికి మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 178 ఎకరాల విస్తీర్ణంలో ఎంఎస్‌ఎంఈ పార్కును తన సోదరుడు, నాటి మంత్రి, దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డి సిద్ధం చేయించారన్నారు. అందులో 73 ఎకరాల్లో ప్లాట్ల విభజన, రోడ్ల నిర్మాణం, తదితర వసతులు కల్పించినట్లు తెలిపారు. ముగ్గురికి చిన్న పరిశ్రమలు స్థాపనకు ప్లాట్లు మంజూరు చేసినట్లు వివరించారు. ఏడాది వ్యవధిలో 50 చిన్న, పెద్ద పరిశ్రమలు స్థాపించి కనీసం యువతకు ఉద్యోగాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ రుణాల మంజూరు మేనేజరు రామకృష్ణ మాట్లాడుతూ పరిశ్రమలను బట్టి రూ.లక్ష నుంచి రూ.కోటి వరకు రుణ సదుపాయం ఏర్పాటు చేస్తామన్నారు. ఎలాంటి యూనిట్‌ల స్థాపనకైనా పది, పదిహేను రోజుల వ్యవధిలో రుణాలు మంజూరు చేస్తామన్నారు. ప్లాట్ల పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయరత్నం, హెచ్‌డీఎఫ్‌సీ ఉన్నతాధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీరాములు, దీపక్, ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో ముగ్గురికి ఐదేళ్ల జైలు

నెల్లూరు(లీగల్): వ్యక్తిపై దాడి చేయగా అతను తీవ్ర గాయాలతో మృతిచెందిన కేసులో నేరం రుజువు కావడంతో నెల్లూరు చంద్రబాబు నగర్‌కు చెందిన షేక్ ఆసిఫ్, షేక్ తన్వీర్, బుజబుజనెల్లూరుకు చెందిన షేక్ ఖలీల్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. బుజబుజనెల్లూరు ప్రాంతంలో అశోక్‌కుమార్ అనే వ్యక్తి మొబైల్ షాపు నిర్వహించేవాడు. 2021 సంవత్సరం డిసెంబర్ 7వ తేదీన కొండా ప్రవీణ్, ఆసిఫ్, తన్వీర్, ఖలీల్, షేక్ రఫీ వెళ్లి రూ.10,000 మామూలు ఇవ్వాలని బెదిరించారు. షాప్‌లో పనిచేస్తున్న వెంకటేశ్వర్లు అరవడంతో పక్కన హెయిర్స్ నిర్వహిస్తున్న అతని తండ్రి శ్రీనివాసులు అక్కడికి చేరుకుని వారితో గొడవపడ్డారు. ఐదుగురూ వెళ్లిపోయారు. అదే రోజు మధ్యాహ్నం వారు హెయిర్స్ షాపులోకి చొరబడి వస్తువులు పడేస్తూ అడ్డొచ్చిన శ్రీనివాసులుపై మారణాయుధాలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతడిని భార్య ప్రసన్న నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ అదే నెల 14వ తేదీన మృతి చెందాడు. ప్రసన్న ఫిర్యాదు మేరకు నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో ఐదుగురు నిందితులపై ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. మొదటి నిందితుడు ప్రవీణ్ మృతిచెందగా, ఐదో నిందితుడు షేక్ రఫీ పరారీ ఉన్నాడు. మిగిలిన ముగ్గురిపై నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున విజయమ్మ కేసు వాదించారు.

## బంధువుల ఇంటికెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో వెంకటేష్

ఆత్మకూరు: మోటార్‌బైక్‌పై బంధువుల ఇంటికి వెళ్తున్న ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన బుధవారం ఆత్మకూరులో జరిగింది. ఎస్సై ముత్యాలరావు కథనం మేరకు.. కలువాయి మండలం తెలుగురాయపురానికి చెందిన వెంకటేష్ (32) ఆత్మకూరు మండలం కరటంపాడులో ఉన్న బంధువుల ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. ఈక్రమంలో ఆత్మకూరు – నెల్లూరుపాళెం మధ్య రహదారిపై వంతెనను ఢీకొని బైక్‌తో సహా కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.